క్లుప్తంగా

రేపు మెగా జాబ్ మేళా

అనపర్తి: నిరుద్యోగ యువతకు **ఉపాధి అవకా**శాలు కల్పించేందుకు ఈ నెల 13న **అనపర్తిలో** ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ **కార్పొరేషన్** ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా **నిర్వహి**స్తున్నట్టు ఎంపీడీఓ మండ **రామకృష్ణారెడ్డి** బుధవారం తెలిపారు. ఈ మేళాలో **19 సం**స్థలు పాల్గొంటున్నాయని, సుమారు **ఆరు వం**దల ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. శుక్రవారం సాయి మాధవి డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగే ఈ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఘనంగా లలితా సహస్ర పారాయణ



పందలపాకలో గౌరమ్మ ఆలయం వద్ద లలితా సహస్ర పారాయణ చేస్తున్న మహిళలు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీగౌరమ్మతల్లి ఆలయం వద్ద మహిళలు లలితా సహస్ర పారాయణ, భజనలు చేశారు. బుధవారం పౌర్ణమి పురస్కరించుకుని ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే స్థానిక మహిళలు భజనలు, లలితా సహస్త్ర పారాయణ చేశారు. భారీ ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బురదకవి సత్య త్రివేణి, ఆలయ కమిటీ సభ్యులు నిల్లా నాగేశ్వరరావు, అంకం శివలింగం, మత్సా రవి, నిల్లా సత్తిబాబు, ఇనుమర్తి నందికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల మంజూరు

బిక్కవోలు: మండలంలో 136 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ వి.శ్రీనువాసు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆరికరేవులలో 2, బలభద్రపురం 23, బిక్కవోలు 25, ఇలపల్లి 2, కాపవరం 8, కొమరిపాలెం 11, కొంకుదురు 17, మెళ్లూరు 3, పందలపాక 13, రంగాపురం 10, తొస్సిపూడి 5, ఊలపల్లి 17 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు.

పెదపూడి ఎస్సైగా తులసీరామ్



తులసిరామ్

పెదపూడి: పెదపూడి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా ఎస్.తులసీరామ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతవరకూ కాకినాడ టూటౌన్ ఎస్‌ఐగా పనిచేసి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన కె.రామారావు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. అలాగే జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తొలకరి పంటకు శ్రీకారం

బిక్కవోలు: ప్రకృతి ఆరాధనే ఏరువాక కార్యక్రమం అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం తొస్సిపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని తొలకరి పంటకు శ్రీకారం చేశారు. ఎంపీపీ తేతలి సుమ, తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, ఏఓ శామ్యూల్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బూరులమ్మ జాతర



కొంకుదురులో బూరులమ్మ తల్లి

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని బూరులమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం గరగ నృత్యాలు, తీన్‌మార్ డ్యాన్స్‌లు, బుట్ట బొమ్మలు, శక్తి వేష ధారణలు అలరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు పీవీవీ సూర్రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజానగరం: మండలంలోని రాధేయపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పాతతుంగపాడు 11 కేవీ లోకల్, అగ్రికల్చర్ ఫీడర్లపై వార్షిక పరమైన మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఈ సమయంలో పాత తుంగపాడు, కొత్త తుంగపాడులలోని అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) నటరాజన్ బుధవారం తెలిపారు.

నువ్వుల పువ్వులు..



- రైతన్నల్లో ఆశలు పెంచిన పంట
- తెగుళ్లను అధిగమించి సాగు

కోరుకొండ: నువ్వుల సాగు రైతన్నల మోములో నవ్వులు తెచ్చింది.. రాజానగరం నియోజకవర్గంలో 25 హెక్టార్ల విస్తీర్ణంలో సాగయ్యింది. ప్రధానంగా కోరుకొండ మండలం బుచ్చెంపేట, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, గాదరాడ గ్రామాల్లో సాగు అధికంగా జరిగింది. తెలుపు, నలుపు రకాలను పండించారు. తెలుపు రంగు గింజలకు మంచి ధర పలుకుతోంది. తెగుళ్లను అధిగమించి సాగవుతున్న ఏకైక పంట ఇదే. నువ్వులు క్వింటాలు ఎంఎస్‌పీ ధర రూ.9,537 ఉండటంతో రైతులు అధికంగా సాగు చేశారు. నువ్వుల నూనెకు ప్రాధాన్యం ఉండడంతో కొనుగోళ్లు పెరుగుతున్నాయి. శుభ్రంగా ఉన్న నువ్వులకు మంచి గిరాకీ ఉంది. నువ్వుల్లో రెండు రకాలు ఉన్నాయి. తెలుపు గింజలకు మంచి ధర ఉంది. దీంతో మెరక ప్రదేశాల్లో ఆరుతడి పంటగా సాగు చేస్తున్నారు.

మంచి దిగుబడి..

ఈ పంట హెక్టారు విస్తీర్ణంలో వెయ్యి క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. దుక్కి నుంచి విత్తు వరకు యాజమాన్య పద్ధతులను అవలంబించడంతో సాగు పెరగడానికి కారణమైంది. ఆహార పదార్థంగా ఉపయోగించే నువ్వుల నూనెలో 55 శాతం ప్రోటీన్లు ఉంటాయి. పూర్వకాలం నుంచి వినియోగంలో ఉన్న ఈ గానుగ నూనెకు మంచి గిరాకీ ఉంది. నూనెను గానుగ ద్వారా తీస్తారు. కిలో నువ్వుల నుంచి 460 గ్రాముల నూనె వస్తోంది. అయితే కిలో నూనె ధర రూ.450 నుంచి రూ.720ల వరకూ హెచ్చు తగ్గుదలతో సాగుతోంది.

70 నుంచి 90 రోజులకు..

సాగుచేసిన 70 నుంచి 90 రోజులకు నువ్వుల పంట దిగుబడి వస్తోంది. పంటలో గౌరి, మధవి, ఎలమంచిలి-11, ఎలమంచిలి-17, ఎలమంచిలి-66 రకాలున్నాయి. ఇవన్నీ 90 రోజుల్లోపే పంటచేతికి వస్తాయి. ఇంట్లో వాడకానికి ఉపయోగించే నూనె కావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇవన్నీ ఎకరానికి 200 నుంచి 600 కిలోల ఉత్పత్తి వస్తోంది. ఇందులో ఎలమంచిలి-66 అత్యధికంగా 600 కిలోల దిగుబడి వస్తోంది.



బుచ్చెంపేటలో నువ్వు పంటను కోస్తున్న కూలీలు



బొల్లెద్దుపాలెంలో సాగైన నువ్వుల పంట

గతంలో క్వింటాలు రూ.10,500

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటాలు నువ్వుల గింజలకు ఎంఎస్‌పీ ధర రూ.10,500 ఉండేది. ప్రస్తుత ప్రభుత్వంలో రూ.9,537గా తగ్గింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అధిక ప్రోత్సాహం ఇవ్వడంతో రైతులకు లాభం చేకూరేది. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ వంటి పథకాలనూ అమలు చేయకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది.

దిగుబడి భలే



నువ్వుల పంట సాగులో సస్యరక్షణ చర్యలను పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో సాగు చేస్తే తెగుళ్ల బారి నుంచి బయటపడొచ్చు. అదే సందర్భంలో మంచి దిగుబడిని పొందవచ్చు. వేసవి పంట కావడం, బరువు నేలలు సాగుకు అనుకూలంగా ఉంటాయి. దీంతో సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు.

–టీకే మల్లికార్జునరావు, వ్యవసాయ శాఖాధికారి

ప్రభుత్వ ప్రోత్సాహం కరవు



వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ ప్రోత్సాహం ఎక్కువగా ఉండాలి. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోవడం లేదు. రైతు భరోసా, సాగునీటి వసతి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదు. పంటలకు ఎంఎస్‌పీ ధరలను ముందే ప్రకటించాలి. అలాగే వాడుక పదార్థమైన నూనె, పప్పు గింజల సాగుకు మంచి ప్రోత్సాహాన్నివ్వాలి.

– తనకాల ప్రసాద్, రైతు, శ్రీరంగపట్నం

పంటకు మంచి ధర కల్పించాలి

పప్పులు, నువ్వుల సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకోవాలి. తద్వారా వ్యవసాయ విస్తీర్ణం, పంట సాగు పెరుగుతోంది. రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఆర్‌బీకే వ్యవస్థను నాశనం చేస్తుంది. పంట ఉత్పత్తులకు మంచి గిట్టుబాటు ధర కల్పించడంలో 'కూటమి' విఫలమైంది.

– ఇసుకపల్లి వరప్రసాద్, రైతు, కోటికేశవరం

భూముల యాజమాన్యంపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఉషారాణి

రాజానగరం: సమస్యాత్మక భూములను తగిన యాజమాన్య పద్ధతులను అనుసరించి సాగులోకి తీసుకువస్తే, మంచి దిగుబడులు పొందవచ్చని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషారాణి అన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో వ్యవసాయ పరపతి సంఘం డీలర్లకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 'సమస్యాత్మక భూములు- సవరణలు' అనే అంశంపై బుధవారం శిక్షణ తరగతులు జరిగాయి. అమ్ల, చౌడు, కారు చౌడు భూములను గుర్తించే విధానం, లక్షణాలు, నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం మట్టి, సాగునీటి పరీక్షలు, భూమి హెల్త్ కార్డుల గురించి ప్రయోగాత్మకంగా ట్రైనీలకు అవగాహన కలిగించారు. అలాగే ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సులో సోమ, మంగళవారాల్లో శిక్షణ ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు పరిహారం



కాపవరంలో మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న ప్రతినిధులు

కోరుకొండ: కాపవరం సూర్యమహాలక్ష్మి ట్రేడర్స్ రైస్‌మిల్లులో పనిచేస్తూ జట్టు కూలీలు జాజుల వెంకన్న, ఆకుల శ్రీరామ్, బలసాని అన్నవరం సత్యనారాయణ మృతి చెందగా, ఆ కుటుంబాలకు బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. ఏప్రిల్ 12న విద్యుదాఘాతానికి గురై ఆ ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాలకు, యాజమాన్యానికి జరిగిన ఒప్పందంలో భాగంగా రూ.15 లక్షల చొప్పున పరిహారంగా ఇచ్చేందుకు అంగీకరించారు. ఇందులో రూ.లక్షను ప్రమాదం జరిగిన మరుసటి రోజు అందజేశారు. కాగా మిగిలిన రూ.14 లక్ష చొప్పున పరిహారాన్ని చెక్కుల రూపంలో మృతుల కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కాపవరం సర్పంచ్ జాజుల రాము, మాజీ సర్పంచ్ తెలగంశెట్టి శ్రీను, రైస్‌మిల్లు యజమానుల సంఘ అధ్యక్షుడు వల్లేపల్లి శ్రీనివాస్, సంబంధిత మిల్లు యజమాని బీశెట్టి గణపతి పాల్గొన్నారు.

బంక్ కొడితే అడగండి!

- పెట్రోల్ బంకుల్లో వసతులు ఉచితం
- మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం తప్పనిసరి
- లేకుంటే ఫిర్యాదు చేయవచ్చు



నగరంలో పెట్రోల్ బంక్



వాహన టైర్లకు ఉచితంగా గాలి పెడుతున్న సిబ్బంది

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతుంటుంది. ప్రతి లీటరుపై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుంతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ సౌకర్యాల గురించి చాలా మందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు లేకపోతే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 23 ఉండగా, రూరల్ పరిధిలోని చాలా పెట్రోల్ బంక్‌ల్లో ఈ సేవలు కానరావడం లేదు. కొన్ని బంక్‌ల్లో టాయిలెట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల గాలి యంత్రాలు పనిచేయడం లేదు. పెట్రోల్ కొట్టించుకున్న తరువాత గాలి పెట్టించుకోవాలంటే సిబ్బంది లేరని సమాధానం చెబుతున్నారు. జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 183 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. బంక్‌ల వద్ద స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి. అది చాలాచోట్ల కానరావడం లేదు.

ఇవి ఉండాల్సిందే..

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను నిర్వాహకులు అనుమతించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చాలాచోట్ల అసలు మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటరు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంక్‌లకు నాలుగు నుంచి ఎనిమిది పైసల వరకూ మరుగుదొడ్ల, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నామని గుర్తించుకోవాలని అధికారులు అంటున్నారు.

ఆపద వేళ ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పని లేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు

పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే సదుపాయాన్ని బంకుల యాజమాన్యాలు అందుబాటులో ఉంచాలి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తుందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌ను యాజమాన్యం అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ను ప్రదర్శించాలి.

గాలి ఉచితంగానే...

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

ప్రథమ చికిత్స కిట్ ఉంచాలి

ప్రతి బంక్‌లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రథమ చికిత్స పెట్టెలో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీంతో పాటు అన్ని మందులపై గడువు తేదీ రాసి ఉంచాలి. పాత మందులు ఉంచకూడదు.

సరైన అవగాహన లేక..



బంకుల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. పెట్రోలియం మంత్రిత్వ శాఖ అధికారులు దీని కోసం సదస్సులు నిర్వహించాలి. సేవలన్నింటికీ కలిపి చమురు ధరలో రుసుల వినియోగదారులు చెల్లిస్తున్నా.. వాస్తవానికి అవి అందుబాటులో ఉండడం లేదు. దీనికి కారణం ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే.

– చీర్ల సీతారామానాయుడు, రాజమహేంద్రవరం

• జోరు వాన



వర్షంతో మోరంపూడి ఫ్లైఓవర్ కింద ఆగిన వాహనాలు



వ్యాన్‌పై ఉన్న సామగ్రికి బరకం కప్పుతున్న దృశ్యం



వర్షంలో ఇలా ఇక్కట్లు



రాజమహేంద్రవరం రూరల్: నాలుగు రోజులుగా సూర్యుని ప్రతాపానికి అల్లాడిపోయిన ప్రజలకు బుధవారం మధ్యాహ్నం జోరున కురిసిన వర్షం ఆహ్లాదపరిచింది. అయితే వాహనచోదకులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షంతో అటుగా వెళ్తున్న ప్రజలు మోరంపూడిపై ఓవర్ కిందకు చేరారు. సుమారు గంటపాటు పడిన వానకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

తవ్వేసి... తరలించి..



పాలమూరులో దేవుడి మాన్యంలో మట్టి తరలించిన తర్వాత ఇలా..

అనపర్తి: ఎక్కడ చూసినా మట్టి అక్రమ తవ్వకాలు అధికమయ్యాయి.. అడిగేవారు లేక అక్రమార్కుల ఇష్టారాజ్యం అయ్యింది.. నియోజకవర్గంలో ఇరవై రోజులుగా రెచ్చిపోతున్న మట్టి మాఫియా చెరువులు, పొలాలు, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో మట్టిని అక్రమంగా తరలించుకుపోయి కోట్లు ఆర్జిస్తుంది. ఇది చాలదన్నట్టు దేవుడి భూములనూ వదలడం లేదు. పాలమూరులోని శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయ మాన్యం భూముల్లో అక్రమార్కులు మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ మేరకు గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్షయ అంతానికి కృషి చేద్దాం



కోటపాడు సభలో క్షయపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: క్షయ అంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోటపాడు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి నుంచి 60 ఏళ్లు పైబడిన వారికి, పాత టీబీ కేసుల వారికి, వారి కుటుంబ సభ్యులకు కళ్లె పరీక్షలు, ఎక్సరేలు తీసి వ్యాధి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. దగ్గు, టీబీ లక్షణాలతో బాధపడుతున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ నివారణ సూపర్‌వైజర్ బి.మహేష్‌బాబు మాట్లాడుతూ అవకాశం ఉన్నవారు నిక్షయ్ మిత్రగా చేరి టీబీ వ్యాధిగ్రస్తులకు అదనపు పౌష్టికాహారం అందించే విధంగా సహకరించాలని కోరారు. సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గరాజు, ఎంపీహెచ్ఏ జి.సూర్యప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీ కె.హంపి ప్రకాశిక, ఏఎన్ఎం వి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమికి వేలం

పెదపూడి: దోమాడలోని వేణుగోపాల స్వామివారి ఆలయ భూమికి వేలం పాట బుధవారం పూర్తయ్యిందని ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆలయానికి సంబంధించి 18.03 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఈ భూమికి ఆలయం వద్ద వేలం పాట నిర్వహించగా పెదపూడికి చెందిన వై.రామకృష్ణ ఏడాదికి రూ.2.60 లక్షలు చెల్లించే విధంగా పాట దక్కించుకున్నారన్నారు. ఈ వేలం పాట మూడేళ్లు ఉంటుందన్నారు. గతంలో ఈ పాట రూ.2.40 లక్షలకు వెళ్లగా, ఈ ఏడాది రూ.20 వేలు పెరిగిందన్నారు.

నేటి నుంచి బస్‌పాస్‌ల జారీ

కోరుకొండ: గోకవరం ఆర్టీసీ డిపో పరిధిలోని విద్యార్థులకు ఈ నెల 12, 13 తేదీల్లో బస్‌పాస్‌లను అందించనున్నామని సుచరిత మార్గరేట్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక రంగులతో తీర్చిదిద్దిన పాస్‌లను విద్యార్థులు పొందవచ్చన్నారు. పాస్‌లను ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రింట్ కాపీని తీసుకునే సౌలభ్యం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థి, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఖేలో ఇండియా నిధులతో చేపట్టిన భవన నిర్మాణ పనులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ (శాప్) చైర్మన్ ఎ.రవినాయుడు బుధవారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులు ప్రారంభమయ్యాయి. వీటి నిర్మాణానికి రూ. 20 కోట్ల ప్రతిపాదనలు చేయగా, ప్రభుత్వం మొదటి విడతగా రూ. 8.3 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో చేపట్టిన పనులు పూర్తి కావాలంటే మరో రూ. 9.26 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని శాఖాధికారులు శాప్ చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో వీసీ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ జి.సుధాకర్, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పెదపూడి: నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జి.మామిడాడలో రూ.11.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. రాజుపాలెంలో దేవీ ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సర్పంచ్ లంక మున్ని, ఎన్డీఏ నాయకులు జుత్తుక సూర్యకుమారి, రావడ నాగు, తమలంపూడి శివరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ప్రారంభం

అనపర్తి: మండలంలోని పెదపర్తి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. నాలుగు సీసీ రోడ్లను ప్రారంభించగా, మరో రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ మండ రామకృష్ణారెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.